# ఆత్మలు వాలిన చెట్టు

చిటారు కొమ్మ కొసరెమ్మకి పల్లవించిన లేలేత మామిడి చిగురు మెత్తదనం మీద లిప్తకాలం వాలాలనేది నా చిరకాల వాంఛ. కనీసం కోటిసార్లయినా కోరుకుని ఉంటాను. శరీరం నుంచి కనీసం ఒక్క క్షణం, ఒకే ఒక్క క్షణమైనా విడివడి జీవితకాలానికి సరిపడా ఊపిరి పీల్చేసుకుని, తిరిగి తప్పనిసరి నివాసమైన ఆ దేహంలోకి మళ్ళీ వెళ్ళాలని! అది అసాధ్యమనీ, శరీరాన్ని ఛిద్రం చేసుకుంటేనేగాని, ఆత్మకి బయటికి వెళ్ళే అవకాశం రాదనీ తెలుసు. కానీ మానవ సహజం గదా! ఆశపడ్డం!

శరీరానికి సంబంధించిన సకల హింసావమానాలు ఆత్మకి అంటవనీ, అది శుద్ధమైందనీ ఎవరో అనగా విన్నాను. అది అబద్ధం అనీ, శరీరానికి తగిలిన ప్రతి అవమానం, ఆత్మకి కొరడా దెబ్బేననీ, జీవితం అంతా ఎడారి ఇసుకలో నడిచివచ్చిన నా పాదాలకి తెలుసు. శరీరపు కుళ్ళు కంపుని విధిగా భరించిన నాకుతెలుసు. నాకు అని ఎందుకంటున్నానో తెలుసుగా! ఇప్పుడు నేను శరీరాన్ని కాను. ఇప్పుడు బావుంది. కొత్త శరీరం తొడుక్కోడం నిజమో అబద్ధమో, గాలిలో కలిసిపోవడం నిజమో అబద్ధమో, ఏమైనా కానీ, ఈ లిప్తకాలపు సుఖం చాలు నాకు- ఈ సేదతీరడం చాలు నాకు. పెదవి దాటి రాని నా దుఃఖం, నా ఆవేదన, నా దుఃఖం ఎవరితోనైనా పంచుకోడానికి, ఎవరికైనా విన్నవించుకోడానికి, ఒక భుజం మీద ఆనుకోటానికి, ఒక హృదయానికి తెలియపరచటానికి ఏ దారీ లేకపోయింది. అంతా ఒంటరితనమే- ఇటువంటి ఏకాంతం కాదది. భయంకరమైన ఒంటరితనం. గుంపులో చిక్కుకుపోయి ఒంటరైపోయిన మనిషి వేదన.

ఈ నిండైన కాలవ పొద్దున, ఈ పురాతన వృక్షం కొసన ఈ ఏకాంతం, ఎన్నాళ్ళకి సాధ్యమైంది నాకు?

ఇదేమిటి! ఇక్కడ ఏవో స్పర్శలు- ఇక్కడ కూడా ఏకాంతం లేదా నాకు?

"నీరూ, గాలీ, పచ్చదనం, మెత్తదనం, ఏకాంతం, అన్నీ నీ ఒక్కదానికేనా! నువ్వొకతెవే కోరుకున్న సుఖాలా? ఈ కడపటి ప్రయాణంలో నీలాగే క్షణికమైన- ఇది క్షణికమైనా ఎంతో విలువైన ఆనందం పొందడానికి ఇంకెవరికీ అర్హతా, ఆశా లేవా?"

"ఎవరు నువ్వు?"

"నువ్వెవరు?"

"నీలాగే మేమంతా!"

ఇన్ని కంఠాలా? ఆత్మలకి కంఠాలా! బావుంది.

"అయ్యో! మీరంతా కూడా నాలాగే వచ్చారా?"

"ఏం! ప్రపంచంలో బాధితురాలివి నువ్వొక్కదానివేనా ఏమిటి? నీదీ ఒక బాధేనా? భర్త సంపాయించిస్తే కూర్చుని తినలేక అహంకారంతో ఈ పనికి పొడిగట్టినదానివి- ఎంతమంది స్త్రీలు కష్టాలకి ఓర్చుకుని బ్రతకడం లేదూ? ఆనుకునే భుజం లేదంటున్నావు? మీ ఆయన భుజం ఏమైపోయింది! అతనంటే గిట్టదు నీకు! అవునా?"

"నీ సంగతి నాకు తెలీదనుకోకు అంకుల్- ఆవిణ్ణనకు. ఇక్కడ మనం ఆత్మలం కదా. అన్నీ తెలిసినవాళ్ళం. నువ్వు మాత్రం ఏం చేశావు? దారుణంగా ఇద్దరు చిన్నపిల్లల్నీ, ఆంటీని హతమార్చావు. నువ్వు హంతకుడివి. నీ ప్రాణం నీ యిష్టం- వాళ్ళని చంపే హక్కెవరిచ్చారు నీకు? నీ తొందరపాటుతనం- నీ మగ అహంకారం..."

"నువ్వా- సువర్చల కదూ నీ పేరు. అవున్లే ఎంసెట్‌లో ర్యాంకు రాలేదని చున్నీతో ఉరేసుకున్న అమ్మాయివి. మరి నీది తొందరపాటు కాదేమిటి. అటు చూడు మీ అమ్మా నాన్న గుండెలు బాదుకుని ఎట్లా ఏడుస్తున్నారో? ఏం- ఇంజనీరువి కాకపోతే ఏమయింది? ఇంకేం చదువులు లేవా? పెళ్ళి చేసుకొని ఇల్లు దిద్దుకుంటే పోలేదా? ఆ తల్లి దుఃఖం చూడు! నేను ఎవర్నీ అట్లా ఏడవమని వదలలేదే! వాళ్ళని బాధల్నించి విముక్తి చేశాను. నా కూతుళ్ళు నేను పోయాక అడుక్కుతినటం ఊహించడం నా వల్ల కాదు. వాళ్ళు రెడ్‌లైట్ ఏరియాలో తేలడమూ సహించలేను. అందుకే వాళ్ళకి విముక్తి కలిగించాను. బ్రతికినన్నాళ్ళూ హాయిగా బ్రతికారు. ఫైవ్‌స్టార్ చాక్లెట్లిచ్చాను, పట్టుపరికిణీలు కుట్టించాను, కార్లోనే తిప్పాను. బ్రతికిన పదేళ్ళూ హంసల్లాగా బ్రతికారు. తరువాత బ్రతికే కాకి బ్రతుకు వాళ్ళకొద్దు. వాళ్ళకి నా చేతుల్తో సంతోషంగా విషం ఇచ్చాననుకుంటున్నావా? నాలుగుసార్లు తెచ్చి పారబోశాను. ఇక తప్పలేదు. తెల్లవారితే నా ఇల్లు జప్తు. నాకు జైలు. నావల్ల కాదు. పేరాశకు పోయి పాతాళంలో పడిపోయినవాణ్ణే కానీ, పారిపోయి ఏ దేశంలోనో దాక్కోగల స్థోమతున్నవాణ్ణి కాను. ఏ రాజకీయ నాయకుడి, ప్రభుత్వోద్యోగి ప్రాపకమూ లేదు. ఎవరికీ తెలీకుండా డబ్బు పోగేసినవాణ్ణి కాను. మోసపోయినవాణ్ణి- ఆశకి బలైనవాణ్ణి. అందుకే ఇప్పుడిది తప్ప గత్యంతరం లేదు నాకు..."

"అవును. ఒక్కుమ్మడిగా డబ్బు కావాలి, సుఖాలు కావాలి. కారు లేనిదే బతకొచ్చు- విస్కీ లేనిదే కూడా బతకొచ్చు. కానీ నువ్వు బానిసవి- వాటికి బానిసవి. అంతే" ఇదెవరి గొంతో!

"నా కారణాలు నాకున్నాయ్. గుండెలవిసేలా రోదిస్తోంది నా తల్లి. ఆవిడ నాకు తల్లిలా ఉందా? జైలు వార్డన్‌లా ఉంది. కాపలా పోలీసులా ఉంది. ఏడవనీండి. ఏడుపెన్నాళ్లుంటుంది. బాగా ఆకలేస్తే కళ్ళు వెనక్కి పోతుంది. నిద్రొచ్చినా అంతే! కాలం గడిస్తే ఇగిరిపోతుంది. నాకు ఇంజనీరింగ్‌లో సీటు రాకపోతే పరువు పోయిందన్నట్టు మా నాన్న- నేను ఒక నిమిషం వెన్నెల్లో ఆడకూడదు, వానలో తడవకూడదు, సంగీతానికి పరవశించకూడదు, ఆడకూడదు, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని ఆవలించకూడదు, స్నేహించకూడదు. అరమార్కు తగ్గితే ఆరువేల ర్యాంకులు దిగిపోతాయట. పావుమార్కు తగ్గినా పాతాళమేనట! అత్త కూతుళ్ళు చూడు, బాబాయిగారమ్మాయిలు చూడు, స్నేహితుడు సుబ్బారావు కూతురు చూడు, ఫ్యాన్సీషాపు పెట్టిన బాలాంబగారి కొడుకు చూడు... వాణ్ణి చూడు, వీణ్ణి చూడు- ఒకడు పిలానీ, ఒకడు ఎన్.ఐ.టీ., ఇంకొకర్తి ఐ.ఐ.టీ., ఒకతె వైజాగ్, ఒకతె హైద్రాబాద్, ఒకతె అహమ్మదాబాద్... చూడవే చూడు. బుద్ధుందా నీకు- ఆవలిస్తే చంపేస్తా. మా తల్లి కదూ... ఇంకాసేపు చదువు హార్లిక్సిస్తా. పరీక్ష అయిపోగానే పిన్నిగారింటికి ముంబాయి పంపిస్తాగా..."

"చుడీదార్ మీదికి చున్నీలెందుకే, ఊర్కే అడ్డాలొస్తాయి! నాకు మంట బాబూ వాటిని చూస్తే."

"చున్నీలెందుకేమిటి నా మొహం! చున్నీలుండాలి. సమయానికి పనికొస్తాయి. ఎవరో చెప్పారు- భారతీయనారికి చీరే సింగారమట. భారతీయ ఎంసెట్ అమ్మాయిలకి చున్నీయే ఉపయోగం. వేసుకోండమ్మాయిలూ చున్నీలు- వీలున్నప్పుడు వీలున్నట్టు వాడుకోండి."

"సరే అంకుల్- నేను కాసేపు అట్లా అట్లా గాలిలో పల్టీలు కొట్టి, కాలవలో మునిగి, వెన్నెల్లో ఆడి, వానలో తడిసి- తరువాత ప్రయాణానికి సిద్ధమైపోతా. అవునూ- ఎవరాయన, అట్లా నవ్వుతున్నాడు. ఆయన ఆత్మకి కూడా కళ్ళున్నట్లున్నాయ్. ఆ కళ్ళల్లో భావాలు చూస్తే భయం వేస్తోంది! ఆయనన్నాను కదా! ఆత్మకి ఆయనా, ఆవిడా అని వుండదు కదా? ఎందుకా జ్యోతులవలె ప్రకాశించే కళ్ళు గల ఆత్మ నావైపు చూసి నవ్వింది? తెలుసుకునే వెడతా, ఇప్పుడిక నా ఇష్టం- నేను ఒళ్ళు విరుచుకుని ఆవలిస్తాను, పరిగెత్తుతాను, పాడతాను, ముందీ ఆత్మ ఎవరో, ఏమిటో అడిగేసి."

"నువ్వడగక్కర్లేదమ్మా. నీకు రోజూ వార్తాపత్రిక చూసే అలవాటుందో లేదో నాకు

తెలీదు. అలవాటుంటే నన్ను గుర్తు పట్టేదానివే. 'ఇంకాస్త తినవే, చదివీ చదివీ అలసిపోయావ్!' అని అప్పుడప్పుడే కుక్కర్‌లో నుండి తీసిన పొగలు కక్కే వేడివేడి అన్నం మీ అమ్మ నీకందిస్తుందే- ఆ అన్నం నీకెక్కడ్నించి వస్తుందో తెలుసా? నేను లేనిదే నీకా అన్నం లేదు. కానీ ఎవరూ 'అన్నదాతా సుఖీభవ' అనటం లేదు. అదీ ఈ దేశంలో తమాషా. అదివరకు అతిథులెవరికి అన్నం పెట్టినా అన్నదాత సుఖీభవ అనేవాళ్ళు, మీరంతా చెప్పే థాంక్స్‌లాగ. ఆఖరికి మా తాత మా నాయనమ్మకి కూడా అట్లా చెప్పేవాడు. 'చాల్లెద్దూ నీ సంస్కృతం నువ్వూ', అనేదావిడ. మా నాయనమ్మెప్పుడు ఇంకో మాట కూడా అంటూ వుండేది. 'మధ్యాహ్నం దాకా చేసి మాయమైపోవాలా?' అని. అదిగో, అట్లా మధ్యాహ్నం దాకా చేసి మాయమైపోయినవాణ్ణి. సరే- అటు చూడు ఇందాక చున్నీ గురించి చెప్పావే- అదిగో ఇంకో చున్నీ, రెసిడెన్షియల్ కాలేజీలో ఉరేసుకున్న చున్నీ. అక్కడ జరిగే అవమానం భరించలేక ఇట్లా వచ్చేసింది పాపం. ఆ పాప కథ ఎవరికీ తెలీదు. ఇప్పుడు మనం ఆత్మలం కదా! అన్నీ దివ్యదృష్టికి తెలుస్తయ్ కదా! నాకిప్పుడే తెలిసింది. ఆ పాప శరీరం నల్లగా ఉండేది. ఆ నల్లటి శరీరంలో రెండు మిలమిల మెరిసే పెద్ద తెల్లటి కళ్ళు, చురుకైన కళ్ళు. బాగా చదువుతుంది. తండ్రికి కూడా పెద్ద ఉద్యోగమే. మంచి బట్టలేస్తుంది. ఖరీదైన జీవితమే వాళ్ళది. ఒకరోజెవరో ఆడపిల్లలే ఆమె నోట్‌బుక్‌లో, 'నేను చాలా అసహ్యంగా ఉంటాను. చీకట్లో నా కళ్ళు మెరిస్తే అందరికీ భయం,' అని వ్రాశారట. అట్లా రోజూ ఎవరో ఆమె నోట్‌బుక్‌లో ఏదో ఒకటి రాసేవాళ్ళు. ఎవరు రాస్తారో తెలీదు. భయపడిపోయింది. చదవలేకపోయింది. మానసికంగా దెబ్బతింది. తరువాత పెట్టిన పరీక్షల్లో మార్కులు తగ్గితే- లెక్చరర్స్ అవమానకరంగా మాట్లాడారు. అమ్మా, నాన్న కోప్పడ్డారు. అంతే ఇట్లా పారిపోయొచ్చేసింది. ఆ బుడతణ్ణి చూశావా! వాడికి పదేళ్ళు. నాన్న కొట్టాడని- కోపం వచ్చి యాసిడ్ తాగేశాడు. అంత సున్నితంగా కొట్టాడు కాబోలు వాళ్ళ నాన్న!"

"ఈ సంవత్సరం పంట పండకపోతే వచ్చే సంవత్సరం పండదా? నువ్వు భార్యా బిడ్డల్ని అట్లా గాలికొదిలేసి రావడం తప్పు. నువ్వు చేసిన అప్పులు తీర్చలేక, అవమానం భరించలేక, పిల్లల్ని పెంచలేక, నీ భార్య ఏం చెయ్యాలని నీ ఉద్దేశం? నువ్వు చేసింది తప్పు."

"ఆపు తల్లీ! నువ్వు చేసింది ఒప్పా? ఇరవై ఏళ్ళు కాపురం చేసినదానివి ఇప్పుడిట్లా ఎందుకు వచ్చినట్లో?"

"అవును- చూడు, ఇరవై ఏళ్ళు కాపురం చేసిన భర్త ఎట్లా గుండెలు బాదుకుంటున్నాడో! బ్రతుకుమీద రోత పుట్టినాక, చావటం చాలా అవసరం. ఒకసారి ప్రయత్నం చేసి మళ్ళీ బ్రతికామో మనమీద ఎవరికీ సానుభూతి ఉండదు. ఎక్కడైనా

చనిపోయిన వాళ్ళకున్న గౌరవం బ్రతికుంటే ఉండదు. మనం చనిపోయి అమృతమూర్తు లవుతాం. అప్పుడే మనకి అశ్రు నివాళులు, అంజలులు. బ్రతికి ఉంటే ఈసడింపులూ, ఛీత్కారాలూ."

"అవును మేం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుని మా బ్రతుకు మేం బతుకుతాం" అంటే వినరు. చచ్చేదాకా వదలరు. చచ్చిన తరువాత వీధి గదిలో పటాలు తగిలించి పూలమాలలూ, అగరొత్తులూ వెలిగిస్తారు."

"ఓహో! నువ్వెవరమ్మా! జూలియట్‌వా, లైలావా? హీర్‌వా! అమర ప్రేమికురాలి పేరేమిటో!"

"అట్లా వెక్కిరించకు, కుటుంబ హంతకుడా! ప్రేమ గురించి నీకేం తెలుసు. ముక్కుపచ్చలారని పిల్లలకి విషమిచ్చి-చంపినవాడికి!"

"నా బిజినెస్ బాగున్నప్పుడు ఎగబడి అప్పులిచ్చారు. అప్పుచేసి ఇల్లు కట్టాను. అప్పుచేసి కారు కొన్నాను. నా భార్యకి నగలు కొన్నాను. నా ఇంటిని సర్వగాడ్జెట్ శోభితంగా తీర్చిదిద్దాను. ఖరీదైన విస్కీ తాగాను, క్లబ్బుల్లో మెంబర్‌షిప్ తీశాను. ఒక మాయా ప్రపంచం నా చుట్టూ నిర్మించుకున్నాను. నా బిజినెస్ దెబ్బతింది. నేను కొన్న షేర్లు పడిపోయాయి. ఆ సంగతి తెలిసి అప్పుల వాళ్ళొచ్చారు. పూలమ్మి కట్టెలమ్మడం నా వల్లకాదు. ఆ ఊబిలో నుంచి బయటపడే మార్గం కనపడలేదు. ఏం చెయ్యాలి నేను. నీ కారణం నీది నా కారణం నాది. నన్ను తప్పు పట్టకు."

"ఏది లేకపోయినా బ్రతకలేమని నమ్మించారు. నమ్మాను. ఫ్రాన్స్ నుంచి దిగుమతైన ఫర్నీచర్ కొను, నడుమునొప్పి తగ్గే నురగ పరుపులు కొను, హోమ్ థియేటర్ కొను, వ్యాక్యూం క్లీనర్ కొను, మైక్రోవేవ్ కొను, షేర్లు కొను... ఈ సూటు వేసుకో, పూర్ణ మానవుడివైపోతావ్. ఇవన్నీ నీకోసం- కారుచౌకగా- కార్లు కూడా చౌకగా అమ్మేస్తున్నాం. నెలనెలా కాస్త కాస్త కట్టు, ఫరవాలేదు. అప్పులిస్తాం, క్రెడిట్‌కార్డు లిస్తాం. ఇన్నిస్తామన్నా కొనవేంట్రా బడుద్ధాయ్! వీటిల్లో బంగారపు కడ్డీలు కూడా పెట్టాం. అదృష్టం ఉంటే బంగారమంతా నీదే. రవ్వల హారాలు కొను, జర్దోసీ చీరెలు కొను. కొనరా వెధవా కొను. కొనవే తల్లీ కొను. కొనవే మూర్ఖురాలా కొను. కొంటూనే ఉండు..."

"ఆ కొనడాలేమిటో నాకు తెలీదు. కానీ నేను అప్పులు చేసి ఎరువులు కొన్నాను, పురుగుమందులు కొన్నాను. మా తాత పొలానికి పెంటపోగు తోలేవాడు. నేను ఖరీదైన ఎరువులు కొన్నాను. ఆయన ముతకబియ్యం పండించేవాడు. వాకిట్లో పాతర వేసేవాడు. నేను నాజూకు బియ్యం పండించాను. పాతరేసేదాకా ఎక్కడ? తిండికుంచుకుని తక్కినవి అమ్మకపోతే సంవత్సరం గడిచేదెట్లా? మా తాతకి లేని బిల్లులు నాకున్నాయ్. కరెంటు

బిల్లుంది, ఫోన్ బిల్లుంది, కేబులు కనెక్షనుంది. నా బిడ్డ చదువుకి ఫీజుంది, మా ఆవిడ జబ్బుకి డాక్టరిచ్చే మందుకి బిల్లుంది. మా నాన్న కాలంలో కూడా ఏ ఋతువు ధర్మం ఆ ఋతువుకుండేది. నాట్లేసే కాలంలో నాట్లు, కోతల కాలంలో కోతలు, ఊడ్పులు. కాలవల్లో నీళ్ళు లేవని పస్తాపడం లేదు. పురుగులు చావకపోవడం ఉందా? ఎరువుల మీద ఎరువులు వెయ్యకపోతే పొలం పండకపోవడం ఉందా? ప్రకృతి తిరగబడింది. వ్యవసాయం తీరే మారింది. అప్పులిచ్చేవాళ్ళు ఉత్సాహంగా ఇస్తారు. అలాగే వసూలు చేస్తారు. అన్నీ ఖరీదే. ప్రాణమే చవకైంది. మూడేళ్ళు వానలు కురవలా- చిన్నం బంగారం, తులం వెండీ లేకుండా అమ్మేశాం. ఇత్తడి రాగి బిందెలు, కడవలు అమ్మేశాం. మళ్ళీ వాన రాకుండానే ఉంటుందా? మళ్ళీ పొలం పండకుండానే ఉంటుందా? ఆశ చచ్చిపోయిందా? కాని ఎవరూ నా మాట నమ్మలేదు. నన్నూ నమ్మలేదు. ఏం చూసి నీకు అప్పియ్యాలి మళ్ళా- ఏమో ఎప్పటికి తీరుస్తావ్ అప్పు? ఎలా నమ్మడం నిన్ను. నిరుడే స్విట్జర్లాండ్ యాత్రలు చేసొచ్చాం. ఈ మధ్య సాయిబాబా గుడి కట్టించాం. ఆ మధ్య కల్కిస్వామి కళ్యాణం చేశాం. మొన్నీమధ్య అమ్మాయి పెళ్ళికి కోటి రూపాయలు ఖర్చు పెట్టాం. అటు మొన్న మా ఆవిడ త్రిభువన్‌దాస్ దగ్గర పదిలక్షలకి రవ్వల గాజులు కొంది. ఇప్పుడు దగ్గరేం లేదు. నీకు మేమేం చెయ్యలేం. యు... బెటర్ డై... అవును పరుపుల్లో వెయ్యి రూపాయల నోట్లు కుక్కుకోండి- లాకర్లలో రవ్వలు నింపండి. చెక్కకీ రాయికే కాక, నేనే దేవుణ్ణని విర్రవీగే అహంకార మానవుడికీ కళ్యాణాల మీద కళ్యాణాలు చెయ్యండి. ఇచ్చారు కదా తీర్పు- ఎక్స్‌గ్రేషియా కోసం చచ్చిపోతున్నానని నవ్వారు కదా? పోనీ ఇచ్చారా? మా ఆవిడ వెర్రిమొహం వేసుకొని ఎన్నిసార్లు తిరిగింది? ఆ తిరిపెం నా భార్యాబిడ్డల్ని జీవితాంతం పోషిస్తుందా? నేను వ్యవసాయం తప్ప చెయ్యలేనివాణ్ణి- నేనుండగా నా భార్య కూలీనాలీ చెయ్యటానికి సిగ్గుపడుతుంది. ఆమెకి తలుపులు తీశాను. కన్నీళ్ళతో భూమి తడిపాను. రక్తంతోనూ తడిపాను. భూమి ఒట్టిపోదు. మళ్ళీ తడుస్తుంది- మళ్ళీ పంట పండుతుంది- పచ్చదనం సంతరించుకుంటుంది. ఈలోగా నేనూపిరితో ఉండే అవకాశమే లేకపోయింది."

"ఇంకో సంబంధం చాలా మంచిది కుదురుస్తాం అన్నారు. నేనీ అబ్బాయితో తిరగటం- మా స్నేహం- మేం ఉత్తరాలు రాసుకోవటం- కబుర్లు చెప్పుకోవటం- అందరికీ తెలుసు. అతన్ని నా జీవన సహచరుడిగా ఊహించుకున్నాను. ఇంకొకర్ని ఆ స్థానంలో ఎట్లా నిలబెట్టను. నావల్ల కాదు. పైగా నా ప్రేమకథ తెలిస్తే అతను ఊరుకుంటాడా? అనుమానంతో దహించుకుపోతాడు. నన్ను హీనంగా చూస్తాడు. నా వల్ల కాదు. అమాయకత్వమో, మోహమో, ఆకర్షణో... ఏమైనా అను- అతనే నా స్నేహితుడు. అతడే

నా జీవన సహచరుడు. నాకు పుట్టవలసిన పిల్లలకి తండ్రి- ఇంకొకరితో నా జీవితం- అసంభవం."

ప్రేమ రంగుల కల- ప్రేమ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తూ మైమరచిపోవడం- ప్రేమ ఖరీదైన బట్టలు వేసుకుని చేసే నృత్యం. అందమైన అమ్మాయిల నాభిమీద వేసే జామపండు. ఆ ప్రేమ ఎందర్నైనా కొట్టి, తన్ని, కొడవళ్ళతో నరికి, పిడికిళ్ళతో గుద్ది- వందమందినైనా చంపి, పెళ్ళికూతుర్ని ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకుంటుంది. ప్రేమని అమ్మాయి కాదంటే వేధించి విసిగించి, ఏదో ఒక విధంగా వొప్పించి, వినకపోతే చంపైనా సరే- నాదే గెలుపంటుంది. ఆ ప్రేమ కులం సంగతి చెప్పదు. వర్గం సంగతి చెప్పదు. అమ్మా, నాన్నల అజ్ఞానాహంకారాల గురించి అసలే చెప్పదు. ఆత్మహత్యల గురించి అసలే తలచదు. పదిహేనేళ్ళ అబ్బాయి, పద్నాలుగేళ్ళ అమ్మాయి ప్రేమ గురించి కాదు భవిష్యత్తు గురించి ఆలోచించాలని అసలు చెప్పదు. కులం పేరుతో మనిషి పడే యాతన, మంచి సంతానం అనిపించుకోడానికి చేసే త్యాగాలు, ఇమోషనల్ బ్లాక్‌మెయిల్స్, సెంటిమెంటు గాలాలు, వీటి గురించి ఇవ్వాల్టి ప్రేమ చెప్పదు. ప్రేమ డెబ్బై ఎంఎం తెర. ప్రేమ చెవులు దిబ్బళ్ళు వేసే సంగీతం. పుట్టుకలు, వంశాలు, కులాలు, వర్ణాలు, మేనిఛాయలు, ఐశ్వర్యాల గోడలు, జెండర్ గోడలు, పవర్ గోడలు- ఇన్ని గోడలున్నాయని చెప్పదు. అన్నీ దాచి పెడుతుంది. ఎంతో భ్రమ పెడుతుంది. ఎంతమందినైనా బలి తీసుకుంటుంది. ప్రేమ వ్యాపారానికి హృదయం లేదు.

"నేను భూమిని ప్రేమించాను. సేవించాను. స్వేదంతో తడిపాను. ప్రాణం నైవేద్యం పెట్టాను..."

"నేను నా బిడ్డల్ని ప్రేమించాను. అందుకోసమే బ్రతికానని నన్ను నేను నమ్మించుకున్నాను. నిజానికి చావలేక బ్రతికానేమో- అతడి గురించి మీకు తెలుసా- చిన్నవాడు, ఎన్నో మంచి కథలు వ్రాసినవాడు- చక్కని ఉద్యోగం సంపాయించుకున్నవాడు. ఉన్నట్టుండి ఒకరోజు ఇలాగే- అతనంటే చాలా యిష్టం నాకు- వారంరోజులు ప్రతీ రాత్రీ ఏడ్చాను అతని కోసం. అప్పుడనిపించింది- సమాజానికి ఎంతో అవసరమైన అతనే చనిపోయినపుడు గడ్డిపోచలాంటి నేనెంత? ఆ యువకుడే పోయినప్పుడు నా బ్రతుక్కు అర్థం ఏమిటి? మూడుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాను. దాన్ని ఇప్పుడు నేను ఆత్మహత్య అనను- ఎందుకంటే నా జీవితమే ఒక ఆత్మహత్య. ఒక విధంగా ఇప్పుడే నేను బ్రతికాను. అప్పుడు దినదిన మరణం- నూరేళ్ళ బ్రతుకులా ఉండేది. ఒకరోజు సాయంకాలం నాలుగ్గంటలప్పుడు- అప్పటికి రెండురోజులుగా విసుగు విరామం లేకుండా త్రాగేస్తున్న నా మొగుడు- సోఫాలో కళ్ళు మూసుకుని ప్రాణాలరచేత పెట్టుకొని పడుకున్న నా మీదకి

వంగి ఒక కాలు నా కడుపు మీద ఆనించి నా గొంతు గట్టిగా పట్టుకొని నన్ను చంపేస్తానన్నాడు. నేను శక్తినంతా కూడదీసుకుని అతని పట్టు తప్పించుకుని చెప్పులు కూడా వేసుకోకుండా వీధినపడి పరిగెత్తాను. కన్నీళ్ళతో మసకలు కమ్మిన కళ్ళతో- అట్లా పరిగెత్తేటప్పుడు నా ప్రక్కన ఒక ఆటో ఆగింది. నా స్నేహితురాలు పద్మ నన్ను ఆటోలోకి లాగి ఇంటికి తీసుకుపోయింది. 'ఏం చేద్దామని బయలుదేరావ్!' అంది. నన్ను చంపే అవకాశం అతనికివ్వదల్చుకోలేదు. ఎందుకొచ్చిన గొడవ- జైలు- వ్యవహారం- పిల్లలకి బాధ- నేను కృష్ణలో దూకితే శవం కూడా దొరకదు- అందరికీ మంచిది...

పద్మ తిట్టింది. 'నీ చదువెందుకు దండగ' అంది. నన్నెక్కడో వుంచింది. నా మొగుడు ఏడ్చాడు. నా పిల్లలు కంగారుపడ్డారు. పిల్లల మీద జాలిపడి నేనెక్కడున్నానో చెప్పాను. ఇంక నన్ను హింసించనన్నాడు- త్రాగనన్నాడు- ఒట్టన్నాడు- చాలా అన్నాడు. తిరిగొచ్చాను. ఆ సాయంత్రం అతను నా ముందే గ్లాసు పెట్టుకుని కూర్చుని కుటుంబం పరువు తీశావన్నాడు. చాలా చాలా అన్నాడు. నేనెందుకు అతన్ని నమ్మానో నాకర్థం కాలేదు. ఒక నెల గడిచాక, ఇంక భరించలేక ముప్పై నిద్రబిళ్ళలు మింగాను. అతను ఏడ్చి మొత్తుకొని, ఆస్పత్రిలో చేర్చి అవన్ని కక్కించి నన్ను బ్రతికించాడు. ఆ అవమానాన్ని నేను భరించలేకపోయాను. నాకు 'సూయిసైడల్ టెండన్సీ' ఉందని అబ్రకదబ్రగారి దగ్గర కౌన్సిలింగ్‌కి తీసుకువెళ్ళారు. చాలామంది చెప్పారు- ముష్టివాళ్ళు బ్రతకడం లేదా, కుష్టువాళ్ళు బ్రతకడం లేదా? త్రాగి రోజూ తన్నే భర్తల భార్యలు బ్రతకడం లేదా? నీకేం వచ్చింది? అన్నారు. అబ్రకదబ్రగారు చెప్పినట్టు నాకెవరూ స్నేహహస్తాలు అందించలేదు. నన్ను పువ్వుల్లో పెట్టి కాపాడుకోలేదు. అహర్నిశలూ అంటిపెట్టుకుని మంచి మాటలు మాట్లాడలేదు. బ్రతుకు మీద ఆశ కల్పించలేదు. చావు మీదే ప్రేమ కలిగించారు.

"బయల్దేరాను- తిరిగొచ్చాను- మళ్ళీ బయల్దేరాను. ఇక తిరిగొచ్చే ప్రసక్తే లేదనుకొని ఘాటైన పురుగుమందు తాగేసి గిలగిలకొట్టుకుని విముక్తి పొందాను. నేను తాగిందీ ఎరగడు- విలవిలాడిందీ- గిలగిల తన్నుకుందీ ఏదీ ఎరగడు. ఉదయం పదింటికి నన్ను లేపటానికొచ్చి, చూసి... అదుగో చూడండి- ఆ దొంగ ఏడ్పు- ఆ భుజం మీద నేను ఆనుకోవాలి- ఎంతమంది ఆడవాళ్ళని ఎక్కించుకున్నాడో చూడండి ఆ భుజాల మీద. ఐ హేట్ దట్ మ్యాన్ ! టు హెల్ విత్ హిమ్..."

"మనం నయం- ఇష్టపడి ఇట్లా వచ్చాం. బ్రతకాలని ఆశపడ్డ ఎంతమంది ఎన్‌కౌంటర్లల్లో, వరకట్నం మరణాల్లో, కక్షలలో- ప్రతీకారాలలో, అసూయల్తో, కార్పణ్యాలతో హత్యలు చెయ్యబడ్డారో... చూడండి- ఎంతమంది అమ్మాయిలు పెళ్ళయ్యాక చున్నీలు మానేసి పమిటకొంగుల్తో 'ఆత్మహత్యలు' చెయ్యబడ్డారో చూడండి..."

"మొన్నటిదాకా ఇది చిలకలు వాలిన చెట్టు- ఇప్పుడిక్కడ చిలకలకి చోటు లేదు. మనమే వున్నాం- మనకి బరువు లేదు కనుక మోస్తోంది పాపం ఈ చెట్టు."

"ఒక్కసారి మా అమ్మని చూసొచ్చి గాలిలో కలిసిపోతా. పాపం చాలా ఏడుస్తోంది."

"మామూలు చదువులకి విలువెక్కడుందొదినా. ఆఖరికి పెళ్ళి కావాటానిక్కూడా ఇంజనీరింగ్‌లూ, ఎం.సి.ఏ.లూ కావాల్సొచ్చె- బి.ఎ., ఎం.ఎ., చదివిన పిల్లలకి ఉద్యోగాలున్నాయా? నువ్వు నేను రిటైరయ్యేదాకా ఉద్యోగం చేసి కాస్తో కూస్తో పెన్షన్ తీసుకుంటున్నాం- ఇప్పుడు ఉద్యోగాలకి భద్రత ఏదీ- అన్నీ టెంపరరీవే- మరి పిల్లని ఇంజనీర్ను చెయ్యాలని నేను ఆశపడితే తప్పా? ఏ తల్లి తన పిల్ల బాగుండాలని కోరుకోదు? రోజులతో పాటు నడవటం తప్ప ఏం చెయ్యాలమ్మా నేను? దానికి మంచి ఉద్యోగం రాకపోతే, మంచి పెళ్ళిసంబంధం రాకపోతే ఆ తప్పు నాదే కదా అవుతుంది చెప్పు? ఈసారి ర్యాంక్ రాకపోతే ఇంకోసారి పరీక్ష రాయకూడదా చెప్పు. ఇట్లా చేస్తుందా అది? అందరిలాగే నేనూ చేశాను- కాలంతో పాటే..."

"అమ్మది కాదట తప్పు- ఎవరిది మరి! అమ్మా, నేనూ కూర్చుని మాట్లాడుకుంటే బాగుండేదేమో! కానీ, ఎంత విసుగెత్తి పోయాను నేను."

"తప్పు చేశానేమో- నన్ను నమ్ముకుని నాతోనే జీవితం అనుకుని వెండి కడియాల దగ్గర్నుంచీ చెవిదుద్దుల దాకా నాకిచ్చి నా ఆవేశాలన్నీ భరించిన ఇల్లాల్ని ఇట్లా వదిలేసి రావటం తప్పేమో- కలిసి అడుక్కుతినేవాళ్ళమేమో. కలిసి ఆకలికి మాడి చచ్చిపోయే వాళ్ళమేమో- కలిసే అవమానం భరించేవాళ్ళమేమో! రైతుల ఆకలి చావులు పేపర్లనిండా వార్తలయినప్పుడు- దేశానికి ఎంత గౌరవం!"

గాలికి మామిడిచెట్టు కదులుతోంది.

యువతీ యువకుల్ని బ్రతికించుకోలేని సమాజం, రైతుని నిలవరించలేని సమాజం, వ్యవస్థ- గృహిణి సంగతి పట్టించుకుంటుందా? కాలిపోండి తల్లులూ- కావల్సినంత కిర్సనాయిలిస్తాం- పురుగుమందుల అమ్మకం మీద ఎట్లాంటి నిషేధం లేదు- గులాబీలకు తెగులు పుట్టిందని చెప్పండి- కాలవలు, నిద్రమాత్రలు- ఆఖరికి మీ పమిట కొంగులే వున్నయ్ కదా! సమాజానికి సిగ్గుపడే గుణం ఇంకా మిగిలుంటే అది సిగ్గుపడేలాగ భారతనారికి సింగారమైన చీరెతోనే మెడకి ఉరి బిగించుకోండి!

"ఇప్పుడనిపిస్తోంది- నా భార్యా, పిల్లల్ని చంపి నేను తప్పు చేశానేమో! వాళ్ళకి ఖరీదైన బ్రతుకు మప్పి- నా మీదే ఆధారపడేలా చేసి తప్పు చేశానేమో!"

"నేనొక మూర్ఖుడ్ని ఎదుర్కోలేక- పారిపోయానేమో..."

"నేను అమ్మనీ, నాన్ననీ వొప్పించటానికి ఇంకాస్త గట్టి ప్రయత్నం చేయాల్సిందేమో!

అయినా వాళ్ళ మాట నేను వినాలి- కానీ వాళ్ళు నా మాట వినే అలవాటు, ఆచారం లేదే!"

"నేను నా శాయశక్తులా పోరాడి- చివరాఖరికి ఇట్లా చేతులెత్తేశాను. లేదంటే నా భూమిని వదిలిపోతానా! వాన బదులు నా స్వేదంతో ఆమె దాహం తీర్చాను. నా కన్నీళ్ళతో తడిపాను- వాన రాకపోదు- పంట పండకపోదు- ఏదో మార్గం దొరక్కపోదు. కానీ ఈ లోగా నన్నాదుకునే వాళ్ళు దొరకలేదు. అప్పుల భారం తీరే మార్గం కనిపించలేదు. నేనయితే పారిపోయాను- నా భార్యని సమిధని చేశాను."

"బావుంది- శరీరాన్ని మోసినన్నాళ్ళు అన్నీ సమస్యలే- మళ్ళీ ఇప్పుడెందుకీ పశ్చాత్తాపాలు, సంజాయిషీలు, సమర్థింపులు. పిరికితనమో, అతి ధైర్యమో- క్షణికావేశమో, ఏమైనా కానీ- నిర్ణయం జరిగిపోయింది కదా! మనం ఈ నిర్ణయానికి రాకుండా ఎవరడ్డు పడ్డారు! ఎవరు ధైర్యం చెప్పారు?. 'మేం వున్నాం' అని వీపు తట్టలేదు- మనకి మనం నచ్చజెప్పుకుని స్థిరంగా నిలబడే వ్యక్తిత్వమూ ఇవ్వలేదు. అటువంటి పరిస్థితులు లేవు. ఒక పాప చనిపోతే, వేలాదిమంది తల్లిదండ్రులు స్పందించి రెండో పాపని కాపాడాలి. ఒక అమ్మాయి కట్నం కోరలకి చిక్కి మాడి మసైపోతే, ఇంకొకమ్మాయి అట్లా కాకుండా అమ్మానాన్న, స్నేహితులు, చట్టం, సమాజం చూసుకోవాలి. ఒక గృహిణి ఉరేసుకుంటే మరొక గృహిణి బలైపోకుండా, భర్తలంతా ఉలిక్కిపడి ఇంటికి పరిగెత్తి భార్యల్ని కాపాడుకోవాలి. ఒక రైతు చనిపోతే లక్షలాదిమంది రైతుల్ని రక్షించుకునే నిజాయితీ ప్రయత్నం చెయ్యాలి. ఏదీ ఆ పరిస్థితి? ఎవరేమైతే మనకేమిటి? నా సంపదకు శ్రీరామరక్ష- కుర్చీ పదిలం- తెల్లవారేసరికి వచ్చే వార్తాపత్రికల్లో, ఆత్మహత్యల వార్తల్ని బ్రెడ్‌ముక్కల్లాగ వేడి కాఫీలో నంజుకుందాం-

"రాత్రి పూటొచ్చే ఛానెల్ వార్తల్ని మంచింగ్ చేద్దాం. ఎందుకింత యావ. పదండి, గాలిలో కలిసిపోదాం- ఈ చెట్టుని ఇకనైనా చిలకలకీ, కోయిలలకీ వదిలేద్దాం... మిగిలున్న కొన్ని చెట్లయినా వాటికిద్దాం."

"మనం మరీ ఇంత కుంగిపోయి ఉండటం తప్పేమో. ఇంత నిరాశగా మాట్లాడ్డం కూడా తప్పేమో. కాస్త ఆలోచించి ఉండవలసిందేమో. ఇట్లా చేసిన మనం సమస్యలకు చావే పరిష్కారం అని ఇంకా కొంతమందికి మార్గదర్శనం చేసినట్లయిందేమో. మన శక్తినంతా కూడదీసుకుని బ్రతికే హక్కు కోసం కొసదాకా పోరాడవలసిందేమో."

"చలిదేశాలలో ఇళ్ళు కట్టుకోటానికి మనదేశపు మామిడిచెక్క శ్రేష్ఠమని ఏ శాస్త్రవేత్త కనిపెట్టనంత వరకూ ఫరవాలేదు. ఇట్లా మనం వాలడానికి ఒకటీ రెండూ చెట్లుంటాయి..."

"అట్లా అనొద్దు- మన చెట్లన్నీ మనం ఉంచుకోవాలి. వాటి మీద పక్షులే వాలాలి. ఆత్మలు కాదు. ఆ రోజు కోసం చూద్దాం." *

*(అరుణతార - ఏప్రిల్ 2006, కథ 2006)*